68

# అన్ హేపీ జర్నీ

బీచి వొడ్డున ఆవిడ కనిపించేసరికి మెరుపును చూసినట్లు అతని కళ్ళు మిరుమిట్లు కొల్పేయి. ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు. మనం మెరుపును ఎన్ని సార్లు చూసినా చూసినప్పుడల్లా కళ్లు మిరుమిట్లు కొల్పుతాయి. అలాగే ఆవిడ్ని చూసినప్పుడల్లా అతనో క్షణం కళ్ళు మూసుకుంటాడు. ఎప్పుడు కనిపించినా ఆవిడ అందమైన అలంకారాలతో తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుంది. అతని మనసు ఒక తృటి కాలం భయంతోనూ, ఆనందంతోనూ. సందేహంతోనూ జుగుప్సతోనూ ఇంకా అనేక రకాల ద్వందాలతోనూ నిండిపోతుంది.

ఇంతకీ చూసినదెవరు? చూడబడినదెవరు?

చూసినవాడు కృష్ణమూర్తి. దేశంలో ఉన్న అనేకమంది కృష్ణమూర్తులలో ఒకడు. బి.ఏ. పాసైన అనేకమందిలో ఒకడు. అనేకమంది నిరుద్యోగులలో ఒకడు. చదువు పూర్తయి రెండేళ్ళయినా ఉద్యోగమేదీ దొరక్క ఊరుమీదపడి తిరుగుతూ ఇంట్లో చీవాట్లు తింటూ లోకంలో యితరుల మీదా తనమీదా నమ్మకం నశించి ఎవర్ని చూసినా భయపడుతూ, బ్రతుకంటే బెంగతో అసహ్యంతో అనుమానాలతో సతమతమవుతున్న మనిషి కృష్ణమూర్తి. ఉద్యోగాలకు దరఖాస్తులు వ్రాసి-వ్రాసి దస్తూరీ కుదిరింది. ఎక్కిన గుమ్మం ఎక్కకుండా ఆఫీసుల చుట్టూ తిరిగి-తిరిగి అడ్రసులన్నీ కంఠోపాఠం అయాయి. పలుకుబడి ఉన్న ప్రతివాడ్ని ప్రాధేయపడి డబ్బు హోదా పలుకుబడి ప్రతిష్టా కావాలంటే ఏం వుండాలో ఏం పనులు చేయాలో గ్రహించి ఆ అవకాశాలు తనకు లేవనీ ఆ పనులు తనకి చాతకావనీ తెలుసుకున్నాడు.

పగలల్లా ఊరుమీద తిరిగి అలసిపోయి పాతిక పైసలిచ్చి కాఫీ

తాగి సాయంత్రానికి బీచి ఒడ్డున నిర్మానుష్యంగా ఉన్న చోటు చూసుకుని కూర్చున్నాడు కృష్ణమూర్తి.

ఆ సమయంలో కృష్ణమూర్తిచే చూడబడిన మనిషి కుసుమం. పూర్తిపేరు టి. వెంకట కనకదుర్గా కుసుమకుమారి. పాము పొర విడిచిపెట్టినట్టు ఆమె తన పాతపేరు విడిచిపెట్టి కుమారి కుసుమ అని కొత్తపేరు పెట్టుకుంది. అందరూ పలకడానికి నోరుతిరగని పేరు నడవని కొత్త కారులా వున్నా వొకటే లేకపోయినా వొకటే కాబట్టి నడిచే పాతకారైనా నయమన్నట్టుగా పాత రకం పేరైనా సింపుల్‌గా వుంటుందని కుసుమ అని పెట్టుకుంది. ఆపేరు యిప్పుడు అనేకమంది నోళ్ళలో సుళువుగా నలిగి ఆవిడ కీర్తికి దోహదమయింది.

కుసుమకి మంచియవ్వనముంది.అందముంది.డబ్బుంది.చదువుంది. తండ్రి కట్టిన భవనముంది. ముద్దుగా పెంచిన కుక్కలున్నాయి. వీటన్నిటి వల్ల ఆవిడికి ఎక్కువగా గర్వముంది. చెవులకి ఖరీదయిన రింగులు మెళ్ళో ఖరీదయిన గొలుసు చేతికి రిస్టువాచీ ఎత్తుమడమల జోడు, కొబ్బరిచెట్టుకు మనీప్లాంటు చుట్టుకున్నట్టు ఒంటికి చుట్టుకున్న టెర్లిన్ చీర ఇలాంటి అలంకారాలతో బాటు గర్వం కూడా ఆమె అందానికో అలంకారమని చూసిన వాళ్ళంటూవుంటారు.

ఇంట్లో యిద్దరు డ్రైవర్లున్నప్పటికీ కుక్కని వెనక సీట్లో కూర్చో బెట్టుకుని తనే కారు డ్రైవ్ చేసుకుంటూ బీచికి వచ్చింది కుసుమ. వచ్చి వచ్చి కృష్ణమూర్తి కూర్చున్న చోటికి వచ్చింది. అక్కడ కృష్ణమూర్తిచే చూడబడింది. కాని కృష్ణమూర్తి ఉనికిని మాత్రం ఆవిడ గుర్తించలేదు. ఎందుకంటే తన ఉనికి యితరులచే గుర్తించడమే గాని ఇతరుల ఉనికి గుర్తించడం ఆవిడకి అలవాటు లేదు.

చేతిలోని బంతి నీటిలోకి విసిరి టామీని పోయి తీసుకురమ్మంది

కుసుమ. దేశంలోని అధిక సంఖ్యాక ప్రజలకంటె పదిరెట్లు ఎక్కువగా బలిసివున్న అల్‌షేషియన్ ఒక్కదూకులో నీటి ఒడ్డుకి వరుగెత్తి బంతిని నోటితో కరిచిపట్టి తీసుకొచ్చి కుసుమకిచ్చింది. కుసుమ టామీనిముద్దుగా ఒంటిమీద చేత్తోరాసి కౌగిలించుకుంది. మళ్ళీ-మళ్ళీ బంతిని రకరకాలుగా విసిరి టామీతో ఆడుకుంంది కుసుమ.

కృష్ణమూర్తి టామీని దీక్షగా చూశాడు. తనకంటె టామీయే అదృష్టవంతురాలని అనుకున్నాడు. టామీకి కుసుమ యింటికి కావలా కాయడం, ఆవిడతో ఆడుకోడం, ఆవిడ్ని సంతోష పెట్టడం లాంటి పనేదో వుంది. ఆ ఉద్యోగానికి తగినట్టుగా దానికి పుష్టిగా తిండిపెడ తారు. పెద్ద భవంతిలో వుంటుంది. కారులో వెళ్తుంది. ఇంకేం కావాలి? తనకా కుక్కకి దొరికిన ఉద్యోగం లాంటిది దొరికినా బాగుండునను కున్నాడు. కాని ఎవరిస్తారు.

ఈ కుసుమ తను చదివిన కాలేజీలోనే చదివింది. తను బి. ఏ చదివేటప్పుడు ఆవిడ బి. ఎస్. సి చదివేది, ఆవిడ్ని ఎన్నోసార్లు కాలేజీలో చూశాడు. కాని యిప్పుడు పలకరించాలనే కోరిక కలగలేదు. పలకరించేందుకు ధైర్యం కూడా లేదు. సముద్రపు గాలికి ఎగిరే ఆవిడ తలవెంట్రుకలకీ, టెర్లిన్ చీర కొంగుకి ఉన్నంత విలువ తనకి లేదు. ఆవిడ పెంపుడు కుక్కకున్న విలువ తనకి లేదు. అలాంటప్పుడు ఎలా పలకరించడం ?

చెలియలి కట్ట దాటలేక కోపంతో విరిగి పైకెగిరి పడుతున్న కెరటాల్ని చూస్తున్నాడు కృష్ణమూర్తి. "మానవాళికి నిజంగానే మంచి కాలం రహిస్తుందా.... కదలి నృత్యం శమిస్తుందా...." అనే శ్రీశ్రీ గేయం జ్ఞాపకమొచ్చింది. అవును ఈ సందేహం కృష్ణమూర్తికి వచ్చింది.

"హల్లో మిస్టర్, ప్లీజ్, మిమ్మల్నే" అని ఎవరో పిలిచినట్టయి

వెనక్కి తిరిగి చూశాడు కృష్ణమూర్తి. కుసుమ చేతితో ఒక గొలుసు పట్టుకుని నిల్చుని వుంది. కృష్ణమూర్తి గాభరాగా లేచి నిల్చున్నాడు. ఆవిడ చేతిలో గొలుసు చూసి తన చేతికి సంకెళ్ళు వేయడాని కొచ్చి నట్టుగా భయపడ్డాడు. అది కుక్క గొలుసనే విషయం ఒక్క తృటిలో గ్రహించి వెంటనే ధైర్యం తెచ్చుకుని "నమస్తే.... " అన్నాడు.

"నమస్తే. మీరు కాలేజీలో— "

"బి. ఏ పాసయ్యాను. మిమ్మల్ని కాలేజీలో చాల సార్లు చూశాను.

ఆవిడ సంతోషించినట్టు చిరునవ్వు నవ్వింది

"నాకో చిన్న హెల్ప్ కావాలి" అంది హెల్ప్ అనేది యితరుల నుంచి శాసించి పుచ్చుకోగలననే ధైర్యంతో.

మీకు నా హెల్పా? నా హెల్పు కావల్సిన వాళ్ళు కూడా యీ లోకంలో ఉన్నారన్నమాట.

కుసుమ కిల-కిల నవ్వింది. ఆవిడ అతని మాటల్లోని హ్యూమర్ గ్రహించింది కాని పేథోస్ గ్రహించలేదు.

ఒక్కసారి దయచేసి రండి. నాకారు స్టార్టవడంలేదు. బేటరీ వీక్‌గా ఉన్నట్టుంది. నేను స్టీరింగు పట్టుకుని స్టార్టు చేస్తాను. మీరు కొంచం కారు తొయ్యాలి. స్టార్టవుతుంది. ఓ.కే,

ఈవిడకి తను సాయంచేస్తే ఆవిడ తనకేమయినా సాయం చేస్తుందా? కుసుమ తండ్రి మంచి పలుకుబడి వున్నవాడు. ఆయనతో చెప్పి ఏదయినా వుద్యోగం యిప్పించలేదా? అయితే యీవిడ కారు తోసినంత మాత్రాన తనకు రికమండ్ చేస్తుందా? ఆవిడకి తన మీద ఆసక్తి ఎందుకుండాలి? ఏ ప్రేమో గీమో అయితే చేయొచ్చుగాని,

"రండి రండి నాకు లేటయి పోతోంది."

"పదండి!" అంటూ బయలుదేరాడు కృష్ణమూర్తి. కారు ఒక ఫర్లాంగు దూరంలో వుంది. ఇద్దరూ యిసకలో ప్రక్క-ప్రక్కనే నడుస్తున్నారు.

"మీరు భీమారావుగారి కుమార్తె కదూ?" అన్నాడు కృష్ణమూర్తి ఆ నిశ్శబ్దం భరించలేక.

"అవును," అన్నది కుసుమ ముక్తసరిగా.

"మీ ఇల్లు చాలాదూరమనుకుంటాను."

"అవును, నాలుగైదు మైళ్ళుంటుంది."

"చాలదూరమే. దారిలో ఈ కారు మళ్ళీ ఆగిపోతే తొయ్యడానికి నన్నాకారులో కూర్చోబెట్టుకెళ్ళండి."

కుసుమ మళ్ళీ కిలకిల నవ్వింది.

"మీకు సెన్స్ ఆఫ్ హ్యూమర్ బాగా ఉన్నట్టుందే!" అంది నవ్వుతూ.

"మీకారాగి పోయినప్పుడల్లా దాన్ని తోసే ఉద్యోగమిప్పించండి చేస్తాను. పని లేకుండా వున్నాను."

దీనికి కిల-కిల నవ్వింది కుసుమ.

"మీరు బి. ఏ పాసయానన్నారు."

"అవును, బి. ఏ పాసయిన వాడు కారు తొయ్యడానికి పనికి రాడా? ఇప్పుడు తోసి చూపిస్తానుగా!"

కుసుమ ఈసారి కిల-కిల నవ్వలేదు.

ఇద్దరూ కారు సమీపించారు. కుసుమ కారెక్కి స్టీరింగు ముందు కూర్చుని స్టార్ట్ చేసింది. కృష్ణమూర్తి కారు తోసేడు. కారు స్టార్టయింది.

"రండి, బాక్ సీటులో కూర్చోండి" అంది కుసుమ.

"బాక్ సిటులో మీ అల్‌షీషియన్ వుంది నాకు భయం."

కుసుమ మళ్ళీ నవ్వి "ఐతే ఫ్రంటులోనే కూర్చోండి" అన్నది.

కారు కొంతదూరం వెళ్ళింది. ఇద్దరూ మాట్లాడలేదు దగ్గరగానే కూర్చున్నప్పటికీ యిద్దరిమధ్య కొన్ని మైళ్ళ దూరం ఉన్నట్టుగా వుంది. మాట్లాడుకునేందుకు విషయాలేమీ లేవు. మీ నాన్నగారితో చెప్పి ఏదైనా వుద్యోగం యిప్పించండి అని అడుగుదామని కృష్ణమూర్తికి నోటి వరకూ వచ్చింది. కాని మా నాన్న మినిస్టర్లూ, ఎం. పీలు భారీ వ్యాపారస్తులూ తీసుకొచ్చేవాళ్ళకే వుద్యోగాలిప్పిస్తాడు అంటుందేమోననే అనుమానం కొద్దీ అడుగలేదు. ఆవిడంతట ఆవిడే తన ఉద్యోగ విషయం అడిగితే తనేదైనా చెప్పొచ్చును కాని—ఆవిడ ఆ విషయమే ఎత్త లేదు.

కారు సినీమా హాలు ప్రక్కగా పోతుంది.

"హేపీ జర్నీ పిక్చరు చూశారా?" అంది కుసుమ.

"లేదండీ. బాగుంటుందా?"

"చాలా బాగుంటుంది. హీరో పేదవాడు. హీరోయిన్ చాలా రిచ్. ఒక ట్రయిన్‌లో జర్నీ చేస్తూ వారిద్దరూ ప్రేమించుకుంటారు. ఇద్దరూ వెళ్ళవలసిన ఊళ్ళకు వెళ్ళకుండా దారిలో ఒక చిన్న పట్టణంలో దిగిపోయి పెళ్ళి చేసుకుంటారు."

చాలా ఈజీగా జరిగిపోయింది. సినీమా కాబట్టి!
అన్నాడు కృష్ణమూర్తి.

కుసుమ మళ్ళీ నవ్వింది.

మీ యిల్లు యింకా ఎంత దూరముంది? అన్నాడు కృష్ణమూర్తి.

వచ్చేశాం ఇక్కడికో రెండు ఫర్లాంగులుంటుంది. అంతే!

అయితే మరి మీకారు దారిలో ఆగిపోయే ప్రమాదంలేదు. నేనిక్కడ దిగిపోతాను. ఇక్కడికి మా ఇల్లు దగ్గరే. అన్నాడు కృష్ణమూర్తి.

తన భుజాలమీంచి పెద్ద భారమేదో దిగిపోయినట్టు కుసుమ ఒక నిట్టూర్పు విడిచి కారు నిలబెట్టింది.

కృష్ణమూర్తి కారు "దిగి గుడ్‌నైట్, ఓ ష్‌యు ఎ హాపీజర్నీ" అన్నాడు.

కుసుమ కిలకిల నవ్వి గుడ్‌నైట్. కారు స్టార్టు చేసింది. కృష్ణమూర్తి వెళ్ళబోతూ వుంటే "హల్లో మిస్టర్" అని పిలుపు వినిపించింది,

అతను వెనక్కు తిరిగి కుసుమవేపు చూశాడు. తన పేరు "కృష్ణమూర్తి" అని చెబుదామని మానేశాడు.

కుసుమ తన ఎడం చేయి బయటకి చాపి "ప్లీజ్ కీప్‌దిస్" అని ఒక పదిరూపాయల నోటు కృష్ణమూర్తి చేతిలో పెట్టి స్పీడుగా కారులో వెళ్ళిపోయింది.

కృష్ణమూర్తికి నవ్వొచ్చింది. తను కారు తోసినందుకు ఆవిడ తనకు యీ డబ్బిచ్చి తన సంబంధం తెంపుకుంది.

కాని ఈ పదిరూపాయలు తను పనిచేసి మొదటిసారిగా సంపాదించిన డబ్బు కావడం వల్ల అతనికెంతో సంతోషం కలిగింది.